# నిజమైన పాలకుడు

మంజులత

చంపా నగరంలో మాకందుడనే రాజుకు ముగ్గురు కొడుకులున్నారు. తన రాజ్యాన్ని ఆయన చాలా న్యాయంగా పరిపాలించాడు. తన మరణానంతరంగూడ చంపారాజ్యం అతిన్యాయంగా పరిపాలించబడాలని మాకందుడి ఉద్దేశ్యం. వంశపారంపర్యం ప్రకారంగా అయితే మాకందుడు తన పెద్ద కొడుక్కి రాజ్యాభిషేకం చేయాలి. కాని చంపారాజ్యాన్ని తనకు మల్లేనే న్యాయంగా పరిపాలింపగల్గిన సమర్థత పెద్దకొడుక్కి లేదు.

ఇలా అనుకొన్న కొన్ని నెలలకు మాకందుడికి మరణమాసన్నమైంది. ముగ్గుర్నీ తన దగ్గరకు పిలిచాడు. "నేను మీ వయస్సును బట్టిగాకుండా బుద్ధినిబట్టి— ఈ రాజ్యభారాన్ని అప్పగించదలచాను. కనుక నేను మీకొక పరీక్ష పెడతాను. ఆ పరీక్షలో నెగ్గినవాడికి పట్టాభిషేకము చేస్తాను" అని చెప్పగా ముగ్గురు కొడుకులు సరేనన్నారు. కాని ఆ పరీక్ష ఏమిటో మాత్రం వారికి చెప్పలేదు.

ఆ తరువాత నెలరోజులకు ముగ్గురు కొడుకులకు పరీక్ష పెట్టాడు. ఈ నెలరోజులలో మూడు వేటకుక్కల్ని రప్పించి, పదిహేను రోజులు దిట్టంగా ఆహారం పెట్టించి తక్కిన పదిహేను రోజులు ఆహారం లేకుండా ఎండగట్టాడు.

ఒక గదిలో ముగ్గురు కొడుకులకూ మూడు విస్తళ్లు వేయించి పంచభక్ష్య పరమాన్నాలు వడ్డించారు. ముగ్గురూ కూచున్నారు. పదిహేను రోజుల్నుంచి ఆకలిగొని వున్న మూడు వేటకుక్కల్ని ఆ గదిలో వదిలిపెట్టారు. అవి ఆకలిగొని వున్న కారణాన ఒక్కసారిగా విస్తళ్లమీది కురికాయి. పైగా అవి వేటకుక్కలు. ఆ కుక్కల్ని జూచి పెద్దకొడుకు ఒక్కసారిగా భయపడి విస్తరివదలి గది బయటికి పారిపోయాడు. రెండో కొడుకు సమీపంలో వున్న పీట తీసుకొని కుక్కమీద తిరగబడి దాన్ని చావ చితకకొట్టి బయటికి నెట్టేసి— తనవిస్తరి ముందు కూచున్నాడు.

మూడవకొడుకు తన విస్తరి మీద కెగబడిన కుక్కను ఏమీ అనకుండానే ఆహారాన్ని కొంత దానికి గిరవాటు వేశాడు. మిగిలింది తను తిన్నాడు.

రాజు పెట్టిన షరతు విస్తళ్లలో వడ్డించిన అన్నం తిని బయటికి రావాలని. రెండో కొడుకు మూడో కొడుకు అన్నం ముగించుకొని బయటికి వచ్చారు. రాజు ఇదంతా ప్రక్కనుండి చూచాడు. ముగ్గురు కొడుకులతో ఆ రెండో రోజ మంత్రి సామంతులున్న దర్బారులో రాజు ఇలా చెప్పాడు.— నేను నాకొడుకులకు పరీక్ష పెట్టాను. నా చిన్నకొడుకు దానిలో ఉత్తీర్ణుడయ్యాడు. తక్కిన ఇద్దరూ రాజ్యాభిషేకానికనర్హులు. దీనికి కారణమిది.— మొదటివాడు వేట కుక్కను చూచి భయపడి పారిపోయాడు. కనుక పరిపాలనాదక్షత అతనికి లేదనే చెప్పాలి. వట్టి పిరికివాడు.

రెండోవాడు వడ్డించిన అన్నం తిన్నాడు. గాని, కుక్కను చావమోదాడు. అతడు ప్రజల్ని సక్రమంగా పాలించలేడు.

ఇక మూడోవాడు తనకుతాను తినడమేగాక ఇతరులకు గూడా దాంట్లో భాగం పంచి ఇచ్చాడు. ఇలాంటివాడే ప్రజల్ని సుఖపెట్టగలడు. కనుక నేను నా చిన్నకొడుక్కి పట్టాభిషేకము చేయదలచాను. అని చెప్పగా దర్బారులో వున్న యావన్మందీ తమ అంగీకారాన్ని తెలియజేశారు.

ఆ తరువాత మాకందుడి చిన్నకొడుకు చంపారాజ్యాన్ని చాల న్యాయంగా పరిపాలించాడు. ★

రాజూ - పేదా
వెల రూ 2-0-0
హకల్ బెరిఫిన్
వెల రూ 2-0 0
ఆంధ్రగ్రంథమాల,
మద్రాసు–1